క్లుప్తంగా

వ్యవసాయ పరికరాల పంపిణీ



అల్లూరు : సబ్సిడీపై రైతులకు యంత్ర పరికరాలను స్థానిక మండల వ్యవసాయ కార్యాలయ ఆవరణలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, ఎంపీడీఓ రజనీకాంత్, పెన్నా డెల్టా వైస్ చైర్మన్ బీద గిరిధర్, ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక గ్రీవెన్స్ డే

సీతారామపురం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. రెవెన్యూ సమస్యలు ఉన్నవారు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు సమర్పించవచ్చన్నారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం



ఉదయగిరి రూరల్ : మండలంలోని గండిపాళెం జలాశయ సమీపంలో గంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్‌రోడ్డు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. పీఆర్‌డీఈ మణికుమార్, ఏఈ శ్రీనివాసరాజు పరిశీలించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకుడు రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు పి.రాజా, గోపి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయభాస్కర్‌రెడ్డికి నివాళి



ఆత్మకూరురూరల్ : మండలంలోని నువ్వూరుపాడు పంచాయతీ ఇన్‌చార్జి గడ్డం శ్రీనివాసులురెడ్డి తమ్ముడు విజయభాస్కర్‌రెడ్డి ఉత్తరక్రియలు పాతజంగాలపల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, దాత కంచి పరమేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం జనరల్ సెక్రటరీ అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిల్లూరు ఆదిశేషయ్య, ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ జనరల్ సెక్రటరీ కొండా వెంకటేశ్వర్లు, పార్టీ నేతలు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, పులిమి వెంకటరమేష్‌రెడ్డి, చిట్టెం శ్రీనివాసులు, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నేత మెట్టుకూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో గేదెల మృతి




వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని బుక్కాపురంలో విద్యుదాఘాతంతో గేదెలు మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామంలోని కాటం శ్రీనివాసులురెడ్డి, పాలిమేర మల్లికార్జునకు చెందిన రెండు గేదెలు ఉదయం మేత కోసం పొలానికి వెళ్తున్న క్రమంలో ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ తీగలు తగలడంతో మృతిచెందాయి. సుమారు రూ.1.60 లక్షల విలువ గల గేదెలు మృతిచెందడంతో తమ జీవనాధారం కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

భవన పునర్నిర్మాణానికి పరిశీలన

ఉదయగిరి : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ భవన పునర్నిర్మాణానికి సంబంధించి బుధవారం పీఆర్ డీఈఈ మణికుమార్, ఏఈ శ్రీనివాసరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన పునర్నిర్మాణానికి ఎంపీపీ నిధులు రూ.27 లక్షలతో చేపడుతున్నట్లు వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మృతిచెందిన వెంగయ్య

దుత్తలూరు : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున 565వ జాతీయ రహదారిపై తెడ్డుపాడు సమీపంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. తెడ్డుపాడు గ్రామానికి చెందిన జంపు వెంగయ్య(60) గత కొన్నేళ్లుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ జాతీయ రహదారి సమీపంలోని సత్రంలో ఉండేవాడని స్థానికులు తెలిపారు. తెల్లవారుజామున రోడ్డుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు.

నాడు ఘనం- నేడు దైన్యం

- దుస్థితిలో ఆత్మకూరు రెడ్‌క్రాస్
- వినియోగంలోకి తెస్తే పేదలకు మేలు



ఆత్మకూరులో మూతపడిన రెడ్‌క్రాస్ కార్యాలయం

ఆత్మకూరు : ఎన్నో ఆశలతో ఏర్పాటైన ఆత్మకూరు రెడ్‌క్రాస్ సంస్థ కొన్నేళ్లకే మూతపడింది. ప్రారంభంలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ.. చుట్టుపక్కల మండలాలు, గ్రామాలకు సైతం రక్తనిల్వలు సరఫరా చేసేది. అయితే తరువాతి కాలంలో దీని గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం మూతపడి దీనస్థితిలో ఉంది. ఉన్నతాధికారులు చొరవచూపి పునఃప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

దేశంలోనే తొలిసారి

సాధారణంగా రెడ్‌క్రాస్ సంస్థ శాఖలను జిల్లా కేంద్రాల్లోనే ఏర్పాటు చేస్తారు. అయితే తొలిసారిగా ఆత్మకూరు లాంటి గ్రామీణ ప్రాంతంలో రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్‌ను పాత ప్రభుత్వ ఆస్పత్రిలోని ఓ భవనంలో 2003, అక్టోబర్ 2న ఏర్పాటు చేశారు. ఇలా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైన తొలి రెడ్‌క్రాస్ బ్రాంచ్ దేశంలోనే మొదటగా ఆత్మకూరులో ఏర్పాటైంది. 150 మంది జీవితకాల సభ్యులతో ఏర్పాటై విశేష సేవలు అందించింది. ఏడాది తరువాత అప్పటి ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య ఆర్థిక సహకారంతో అన్నిరకాల పరికరాలు, ఫ్రీజర్లతో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తనిల్వ కేంద్రాన్ని 2005, మే 8న ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఆత్మకూరు, ఉదయగిరి, బద్వేల్, వింజమూరు లాంటి దూర ప్రాంతాలకు ఈ రక్తనిల్వ కేంద్రం నుంచి అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందించి ఆదుకుంది. సుమారు పదికిపైగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు బ్లడ్ యూనిట్‌లను అందించింది. అదే క్రమంలో మరో దాత శ్రీధర్ రెడ్‌క్రాస్‌కు శీతల శవపేటికను కూడా అందించారు.

ఈ ఘనమంతా గతం

ప్రస్తుతం ఆత్మకూరు రెడ్‌క్రాస్ శాఖ పరిస్థితి దైన్యంగా ఉంది. అప్పట్లో రెడ్‌క్రాస్ చైర్మన్ హోదాలో నాటి తహసీల్దార్ శ్రీనివాసమూర్తి రెండుమార్లు సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. 15 ఏళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు మళ్లీ సమావేశమే నిర్వహించలేదు. 2015లో ఆత్మకూరు పట్టణంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రక్తనిల్వ సేవలు మరింత విస్తృత పరచడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిర్వహించే ఆర్‌సీహెచ్–2 ప్రాజెక్ట్ కింద ఆస్పత్రిలోనే విలీనం చేశారు. ఈ క్రమంలో రెడ్‌క్రాస్ ఆధీనంలో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందికే ఆర్‌సీహెచ్–2 ప్రాజెక్ట్‌లో విధులు అప్పగించారు. దీంతో పట్టణంలోని రెడ్‌క్రాస్ సంస్థ మూతపడినట్లైంది. కేవలం రక్తనిల్వ కేంద్రమేగాక అనేక ఇతర సేవలను సైతం మరిచిపోయారు. దీనికితోడు అప్పట్లో తహసీల్దార్ వెంకటనారాయణమ్మ రెడ్‌క్రాస్ భవన నిర్మాణానికి 20 సెంట్ల భూమిని బస్టాండ్ ప్రాంతంలో మంజూరు చేస్తూ పట్టా అందజేశారు. అనంతర పరిణామాల్లో అప్పటి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆ స్థలాన్ని రద్దు చేస్తూ మున్సిపల్ మార్కెట్‌లో కలిపేశారు. దీంతో సంస్థ ఉనికే లేకపోగా కేటాయించిన స్థలాన్ని చేజార్చుకున్న దీన స్థితిలో ఆత్మకూరు రెడ్‌క్రాస్ సబ్ బ్రాంచ్ ఉంది. ఇప్పటికైనా నిర్వాహకులు జీవితకాల సభ్యులతో సంప్రదించి రెడ్‌క్రాస్ ఉనికిని ఆత్మకూరులో తిరిగి సాధించేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

అప్పట్లో ఎన్నో సేవలు అందించాం



20 ఏళ్ల క్రితం ఏర్పాటైన రెడ్‌క్రాస్ ఆత్మకూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో జీవితకాల సభ్యుడిగా పలువురితో కలిసి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాం. ఏటా తప్పనిసరిగా భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించి జిల్లాలోనే రక్తసేకరణలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేశాం. అనంతర పరిణామాల్లో పరిస్థితులు మారాయి. ఇప్పటికైనా నిర్వాహకులు అందరితో సమావేశం నిర్వహించి రెడ్‌క్రాస్ గత చరిత్రను తిరిగి నిలబడేలా కృషి చేయాలి.

– డాక్టర్ ఆదిశేషయ్య,
రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యుడు

తప్పతాగి.. వీరంగం

- రెచ్చిపోతున్న టీడీపీ నేతలు
- వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఇంటి ముందు దౌర్జన్యం



సర్పంచ్ ఇంటి ముందు వీరంగం చేస్తున్న టీడీపీ నేతలు

సోమశిల : తిరునాళ్ల పేరుతో పచ్చపార్టీ నేతలు రెచ్చిపోతున్నారు. మద్యం మత్తులో జోగుతూ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఇంటి ముందు మళ్లీ వీరంగం సృష్టించారు. గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన దాడులతో గతంలో 144 సెక్షన్ విధించగా, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతమవుతుండడంతో పోలీసులు ఏం చేస్తున్నారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రెండు రోజులుగా..

అనంతసాగరం మండలంలోని శంకరనగరం గ్రామంలో తిరునాళ్ల సాకుతో టీడీపీ నేతలు తప్పతాగి వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఇంటి వద్ద వీరంగం సృష్టించిన ఘటన సోమ, మంగళవారాల్లో చోటు చేసుకున్నాయి. గత రెండు రోజులుగా గ్రామంలో డీజేలు, రికార్డింగ్ డ్యాన్సులు, ఆర్కెస్ట్రాలు వంటివి ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల వద్దకు వచ్చి గేట్లను తంతూ ఇంట్లో ఉన్న వారిని అసభ్యకరంగా దుర్భాషలాడుతున్నారు. గ్రామానికి చెందిన మోదేపల్లి రాకేష్ అనే వ్యక్తి సర్పంచ్ ఇంటి వద్ద ఏర్పాటు చేసి ఉన్న సీసీ ఫుటేజీలో పూర్తిగా కనిపిస్తున్నారు. ఆ సమయంలో సర్పంచ్ తల్లి ఇంట్లో ఉంది. ఇంత జరుగుతున్నా పోలీసులు నిద్రమత్తులో ఉండడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం డీజేలు, ఆర్కెస్ట్రాలు, రికార్డింగ్ డ్యాన్సులకు ఎటువంటి అనుమతులు లేవంటున్న పోలీసులు దగ్గరుండి కార్యక్రమాలు జరిపిస్తుండడం, గ్రామాల్లో లేనిపోని సమస్యలు నెలకొనడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇలానే వదిలేస్తే నేరుగా ఇళ్లలోకి దూరి దాడులకు పాల్పడుతారని వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఇంటి వద్ద దుర్భాషలాడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీసులు ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వకుండా ఉంటే ఏ సమస్య ఉండదని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాలకు అధికారికంగా అనుమతులు కావాలని మంత్రిని సంప్రదించగా ఆయన అంగీకరించలేదని సమాచారం.

మూడు స్కీములు, ఆరు స్కాములు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- కూటమి పాలన దోపిడీపై నిలదీసిన వైఎస్సార్‌సీపీ నేతలు

ఆత్మకూరు : కూటమి పాలన మూడు స్కీములు, ఆరు స్కాములు లెక్కన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో పట్టణంలోని ఆయన కార్యాలయంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆదిశేషయ్య, పార్టీ మున్సిపల్ విభాగ ప్రధాన కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం కుట్టు మెషీన్లు అందించే పేరుతో చేపట్టిన స్కీమ్‌లో దాదాపు రూ.167 కోట్లకుపైగా దండుకోవడానికి సిద్ధమైందని తెలిపారు. ఈ పథకానికి 65 కంపెనీలు టెండర్లు దాఖలు చేయగా, 56 టెండర్లను తొలగించేశారని, ఆరు సంస్థలను మలిదశలో తప్పించారన్నారు. కేవలం మూడు సంస్థల టెండర్లనే పరిగణనలోకి తీసుకున్నారని, అందులో రెండు చంద్రగిరి కి చెందినవే అని తెలిపారు. వాస్తవాలు పరిశీలిస్తే ఒక మహిళకు కుట్టు మెషీన్ కొనుగోలు (హోల్‌సేల్‌గా) రూ.4,300 అని, ఒక మహిళకు ట్రైనింగ్ ఇచ్చే కాంట్రాక్టర్‌కు రూ.3 వేలు.. ఇలా మొత్తం ఖర్చు రూ.7300 కాగా, రాష్ట్రంలో లక్ష మంది లబ్ధిదారులకు ఇచ్చే శిక్షణ, మెషీన్ల ఖర్చు రూ.73 కోట్లు అని వివరించారు. అయితే మొత్తం టెండర్ కాస్ట్ రూ.230 కోట్లు కాగా, రూ.73 కోట్లు ఖర్చుకు వినియోగించగా, మిగిలిన రూ.167 కోట్లు నాయకుల జేబుల్లోకి వెళ్తుందా అని ప్రశ్నించారు. పట్టణంలోని రెండు కేంద్రాల్లో పరిశీలించగా ఒక్కో చోట 5, 6 మంది మహిళలు మాత్రమే శిక్షణ తీసుకుంటున్నారని, బినామీ పేర్లు నమోదు చేయించి నగదు స్వాహా చేస్తున్నారనే అనుమానాలు వస్తున్నాయని తెలిపారు. మండలాల్లో మట్టి, ఇసుక, గ్రావెల్ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. తిరుపతి, సింహాచలం ఘటనలపై మంత్రి ఆనం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను రూ.2.40 కొనుగోలు చేయగా గగ్గోలు పెట్టిన టీడీపీ నేతలు ప్రస్తుతం రూ.4.40 ధరకు ఎలా కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, మర్రిపాడు మండల కన్వీనర్ సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ముతీవర్, సయ్యద్ జమీర్, ఆంద్రా సుబ్బారెడ్డి, వెంగళరెడ్డి, కొప్పోలు వెంకటేశ్వర్లు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, చిల్లూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

చిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లిలో కొలువైన శ్రీరామమందిరంలో బుధవారం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీరామనవమిని పురస్కరించుకుని మూడు రోజులుగా ఆలయంలో నవమి వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్న నవమి వేడుకల్లో భాగంగా కల్యాణం ఘట్టాన్ని అర్చకులు కళ్లకు కట్టినట్లు భక్తులకు వివరించారు. కల్యాణ ఉభయకర్తలుగా పెళ్లకూరు మోహన్‌రెడ్డి, శైలజ, పెళ్లకూరు మురళీప్రసాద్‌రెడ్డి, నీరజ దంపతులు వ్యవహరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇందుపూరు రవీంద్రరెడ్డి, ప్రసూన దంపతులు వ్యవహరించారు. రాత్రి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు



కృష్ణారెడ్డిపాళెంలో ప్రత్యేకాలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి



సోమశిల : పాతదేవరాయపల్లిలో..



కొండాపురం : కొమ్మి గ్రామంలో..

కలిగిరి : కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెం తిప్ప వద్ద ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, కృష్ణారెడ్డిపాళెంలోని బ్రహ్మంగారి ఆలయంలో ఆరాధన మహోత్సవాలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

- **సోమశిల :** అనంతసాగరం మండల పరిధిలోని పాతదేవరాయపల్లి, కాకూరువారిపల్లి గ్రామాల్లో వెలసిన బ్రహ్మంగారి ఆలయాల్లో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు భానుప్రకాష్ తొలుత స్వామివారికి పాలాభిషేకాలు, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.
- **కొండాపురం :** మండలంలోని కొమ్మి గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో ఆరాధన మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త కంచర్ల కేశవాచారి ఇంటి వద్ద నుంచి పూర్ణ కుంభం, కలశాలతో పవిత్ర జలాలను ఊరేగింపుగా మఠం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.
- **వింజమూరు(ఉదయగిరి) :** వింజమూరు పట్టణంలోని విరాట్‌నగర్‌లో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వింజమూరులో చిన్నారికి ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

వింజమూరు(ఉదయగిరి) : మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం మండలంలో వింజమూరు, గుండెమడకలలో ఆధార్ సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు.

- **ఆత్మకూరు :** మున్సిపల్ పరిధిలో ఆధార్ కార్డులేని పిల్లలకు గురువారం నుంచి నమోదు చేస్తున్నట్లు కమిషనర్ గంగాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు



ఆత్మకూరు : పట్టణంలోని కోదండ రామాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని ఉదయం గణపతిపూజ, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. తదుపరి అమ్మవారి సహస్రనామాలతో హోమం చేసి పూర్ణాహుతి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి కుంకుమ పూజ, గ్రామోత్సవం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా తన్నీరు కుటుంబీకులు వ్యవహరించారు.

సత్యసాయి మందిరంలో..



ఆత్మకూరు : పట్టణంలోని సత్యసాయి మందిరంలో బుధవారం సాయివ్రతాన్ని నిర్వహించారు. భజనల అనంతరం ప్రసాద వితరణ చేశారు. అనంతరం గిరిజనకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు మీల్స్‌ప్లేట్లు అందజేశారు. నిర్వాహకులు జగర్లపూడి నాగరాజశర్మ పాల్గొన్నారు.

ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి



చెస్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

వింజమూరు(ఉదయగిరి) : ప్రతి విద్యార్థి ఆటల పట్ల ఆసక్తి పెంచుకునేందుకు వేసవి సెలవులను ఉపయోగించుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం క్రీడలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం అనేది ఒక మంచి క్రీడ అని, జ్ఞాపకశక్తి, ఆలోచనా ప్రక్రియను మెరుగు పరుచుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జ్యోతి కొండయ్య ఉన్నారు.

ఐటీఐ కళాశాల ఏర్పాటుపై సందర్శన

సంగం : మండలంలోని అమరపునాయుడుకండ్రిక గ్రామంలో ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమం వద్ద ఐటీఐ కళాశాల ఏర్పాటుకు బిల్డింగ్‌ను ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ డైరెక్టర్ గణేష్‌కుమార్ బుధవారం సందర్శించారు. తరగతి గదులు, వర్క్‌షాపులకు బిల్డింగ్ అనువుగా ఉందా.. లేదా? అని పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. మరమ్మతులు చేపట్టేందుకు ఎంత మేర నిధులు అవసరమనే దానిపై అధికారులతో ఆరాతీశారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ నాగవర్ధన్‌రాజు, ప్రిన్సిపల్ ఏడుకొండలు, ఏఈ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 444 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 444 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 777 బేళ్లు రాగా 444 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 57574.5 కిలోల పొగాకును విక్రయించగా రూ.14773948.20 వ్యాపారం జరిగింది. కిలో గరిష్ట ధర రూ.280 కాగా కనిష్ట ధర రూ.210 లభించింది. సగటు ధర రూ.256.61 నమోదైంది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి



వింజమూరులో..



అల్లూరులో..

వింజమూరు(ఉదయగిరి) : విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కృష్ణారావు, స్థానిక నాయకుడు వనిపెంట వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **అల్లూరు :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ శశిరేఖ, ఎంపీడీఓ రజనికాంత్ పాల్గొన్నారు.

ఆయన రాక మహద్భాగ్యం

- విధుల్లో నిర్లక్ష్య వైఖరి



మధ్యాహ్నం కూడా మూసి ఉన్న పంచాయతీ కార్యదర్శి గది

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి పంచాయతీ కార్యదర్శి దర్శన భాగ్యం స్థానికులకు దొరకడం లేదు. విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తూ సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో అభివృద్ధి కుంటుపడుతోందని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తీరుస్తూ గ్రామాభివృద్ధికి తోడ్పడాల్సిన పంచాయతీ కార్యదర్శి సచివాలయానికి చుట్టపుచూపుగా వస్తుండడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే చందంగా తయారైందని పలువురు వాపోతున్నారు. వాస్తవానికి గ్రామ సచివాలయ సిబ్బందికి హాజరు మ్యాపింగ్ తప్పనిసరి అయినప్పటికీ ఆయనకు మాత్రం ఆరు మాసాల నుంచి అటెండెన్స్ మ్యాపింగ్ లేకపోవడం గమనార్హం. అలాగే సర్పంచ్‌తో పాటు పంచాయతీ ప్రజలు కూడా ఆయన రాక కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బసినేనిపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులకు సక్రమంగా వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.